రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్, పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంక

ప్రతి ఒక్కరికీ ఓటరు స్లిప్ అందిస్తాం

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, ఏప్రిల్ 25 : బీఎల్ఓల ద్వారా ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్ పంపిణీ చేయడం జరుగుతుందని అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సైతం సహకరించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావ్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లోక్‌సభ ఎన్నికల నిర్వహణ సందర్భంగా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ 28 నాటికి ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 85 ఏండ్లు పైబడిన వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 12డీ ఫామ్‌లు 6,070 మందికి ఇవ్వడం జరిగిందని వెల్లడించారు. ఇప్పటి వరకు 354 దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. పీడబ్ల్యూడీ ఓటర్లు 344 మంది దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దివ్యాంగ ఓటర్లు పోలింగ్ రోజు సౌకర్యాల కోసం సాక్ష్యం యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. క్రిటికల్ పోలింగ్ బూతుల్లో లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో వంద శాతం వెబ్ కాస్టింగ్ జరుగుతుందని, ఈవీఎంల స్ట్రాంగ్ రూముల వద్ద నిఘా కట్టుదిట్టంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వర్‌రావు, సవరాల సత్యనారాయణ, కోట గోపి, అబీద్, స్టాలిన్ పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిందని అర్హులు ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిపి అందించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి, డీఈఓ అశోక్, డీఐఈఓ కృష్ణయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలుకూరులో బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే మరోసారి అరిగోస పడుతాం

- రైతుల తరపున కొట్లాడేది బీఆర్ఎస్ ఒక్కటే
- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, నియోజకవర్గ ఇన్‌చార్జి సత్తయ్యగౌడ్

చిలుకూరు, ఏప్రిల్ 25 : మరోమారు కాంగ్రెస్‌ను నమ్మి లోక్‌సభ ఎన్నికల్లో ఓటేస్తే వచ్చే ఐదేండ్లు అరిగోస పడుతామని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సత్తయ్యగౌడ్ అన్నారు. గురువారం చిలుకూరులో బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి ఒక్క కార్యకర్త పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తేనే రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలు అమలు అవుతాయని తెలిపారు. రాష్ట్రంలో రైతులకు కరెంట్, సాగు నీరు లేక పంటలు ఎండిపోతుంటే కాంగ్రెస్ నాయకులు చోద్యం చూస్తున్నారని దుయ్యబట్టారు. రైతుల కోసం కొట్లాడే ఏకైక నాయకుడు కేసీఆర్ ఒక్కడే అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి నర్సయ్య, జానిమియా, అల్సకాని జనార్దన్, తాళ్లూరి శ్రీను, జానకీరామాచారి, కడియాల వెంకటేశ్వర్లు, బెల్లంకొండ నాగయ్య, అన్నపూర్ణ, అంబాల వెంకటి, పాషా, లింగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

తెలంగాణకు బీఆర్ఎస్సే శ్రీరామ రక్ష

అనంతగిరి : తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామ రక్షగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్త కటికం సత్తయ్యగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ భూటకపు హామీలను ప్రజలు గమనిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌కు అండగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. వలస వెళ్లిన వారిని పట్టించుకోకుండా పార్టీ కోసం కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోపాలకిషన్, గుగులోతు శ్రీనివాస్‌నాయక్, వెంకటేశ్వర్లు, పల్లపు శ్రీను, పందిరి వీరయ్య, నాగేశ్వర్‌రావు, చార్లెస్, సత్యనారాయణ, పూర్ణచందర్‌రావు, పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

నేరేడుచర్ల, ఏప్రిల్ 25 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన గురువారం తెల్లవారుజామున నేరేడుచర్ల పట్టణ శివారులో జరిగింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన బొల్లెద్దు జానకమ్మ (50) రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తుండగా మున్సిపాలిటీ శివారులోని పంజాబ్ దాబా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్రగాయాలైన ఆమె అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

జానకమ్మ కుమారుడు సంపత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

సమాచార హక్కు చట్టం ఆయుధం

● ఉమ్మడి ఏపీ ఆర్టీఏ మాజీ ప్రధాన కమిషనర్ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న ఆర్టీఏ మాజీ ప్రధాన కమిషనర్ వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 25 : సమాచార హక్కు చట్టం ప్రజలకు ఆయుధం వంటిదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని విశాంత్ర ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన సమాచారం హక్కు చట్టం అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో చట్టాలు సమగ్ర అమలు కావాలంటే ఆర్టీఏ యాక్ట్‌ను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఆర్టీఏ దరఖాస్తులు ఆన్‌లైన్ విధానంలో తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి, జిల్లా క్రార్యదర్శి శివ, నల్లగొండ అధ్యక్షుడు బైరు సైదులు, కార్యదర్శి శ్రీనివాస్, నియోజకవర్గ నాయకులు జోసఫ్‌రెడ్డి, శంకర్, పుల్లయ్య, చింతకాయల సైదులు పాల్గొన్నారు.

అభిమాన నేతకు అపూర్వ స్వాగతం

- మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజల బ్రహ్మరథం
- పటాకులు కాల్చుతూ పూల వర్షం కురిపించిన నాయకులు, కార్యకర్తలు
- రోడ్ షో పొడవునా ప్రజలకు గులాబీ బాస్ అభివాదం

అర్వపల్లి/నాగారం, ఏప్రిల్ 25 : భువనగిరి రోడ్ షోకు గురువారం సూర్యాపేట నుంచి బయల్దేరిన మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రకు అర్వపల్లి మండలంలోని తిమ్మాపురం, అర్వపల్లి అలాగే నాగారం మండలంలో బీఆర్ఎస్ శ్రేణులు, గ్రామస్తులు, అభిమానులు దారి పొడువునా అపూర్వ స్వాగతం పలికారు. పార్టీ జెండాలను చేబూని పటాకులు కాలుస్తూ అభిమాన నేతపై పూల వర్షం కురిపించారు. ఎండను సైతం లెక్క చేయకుండా దారి పొడవునా కేసీఆర్ బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. బస్సులో నుంచి కేసీఆర్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కుటుంబ సభ్యులు

సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాగారం మండల సీనియర్ నాయకుడు అంబయ్యగౌడ్

అర్వపల్లి : అర్వపల్లిలో కేసీఆర్ రాక కోసం ఎదురు చూస్తున్న మహిళలు



సూర్యాపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేసీఆర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

రాయగిరిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

పరిసరాల పరిశుభ్రతతోనే మలేరియా నివారణ

● సీహెచ్ఓ పద్మ

హుజూర్‌నగర్ రూరల్ , ఏప్రిల్ 25 : పరిశుభ్రతతోనే మలేరియా నివారణ సాధ్యమౌతుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ అన్నారు. గురువారం మండలంలోని లింగగిరిలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మలేరియా రాకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో బస్తీ దవాఖాన డాక్టర్ వాణి, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతగిరి : కీటక జనిత వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని త్రిపురవరం పీహెచ్‌సీ వైద్యురాలు లక్ష్మీప్రసన్న అన్నారు. అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు హరినాథ్, ప్రసన్న, శ్రావణి పాల్గొన్నారు.

తుంగతుర్తి : మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి మల్లెల వందన అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి నిల్వలు ఉన్న ప్రదేశాల్లో కిరోసిన్, వాడిన ఇంజిన్ ఆయిల్ చల్లాలని సూచించారు.

నూతనకల్ : మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ప్రజలకు మలేరియా నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ తారమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అర్వపల్లి : అంతర్జాతీయ మలేరియా డే సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మణిదీప్ మాట్లాడుతూ.. ప్రజలు తమ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ చరణ్, ఎంఎల్‌హెచ్‌పీలు ఎస్.గౌతమి, టి.వశ్రిత, జి.వాణి, హెల్త్ అసిస్టెంట్లు కె.వీరయ్య, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

అనంతగిరి : త్రిపురవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎన్నికల్లో బీఎల్ఓల పాత్ర కీలకం

● ఆర్డీఓ వేణుమాధవరావు

ఆత్మకూర్.ఎస్ : బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవరావు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 25 : ఎన్నికల్లో బీఎల్ఓల పాత్ర కీలకమని ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్పు అందేలా బీఎల్ఓలే పని చేయాలని ఆర్డీఓ వేణుమాదవరావు అన్నారు. గురువారం తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్ఓలు గ్రామస్థాయిలో కీలకంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ వినోద్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఇంద్రకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన

పాలకవీడు, ఏప్రిల్ 25 : మండల కేంద్రంలోని పలు పోలింగ్ స్టేషన్లను ఎస్ఐ లక్ష్మీనారాయణతో కలిసి తాసీల్దార్ శ్రీదేవి గురువారం పరిశీలించారు. అనంతరం తాసీల్దార్ కార్యాలయంలో ఓటర్ స్లిప్పుల పంపిణీపై కలెక్టర్ నిర్వహించిన వెబెక్స్ మీటింగ్ ద్వారా బీఎల్ఓలకు, సూపర్‌వైజర్లకు అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు.

పోలింగ్ స్లిప్‌లు పంపిణీ

చిలుకూరు : ఓటర్ల స్లిప్‌లను తాసీల్దార్ ధ్రువకుమార్ బీఎల్ఓలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఓటరుకు స్లిప్ అందేలా చూసే బాధ్యత బీఎల్ఓలదే ని అన్నారు. కార్యక్రమంలో డీటీ కరుణశ్రీ, ఆర్ఐలు సీతారామయ్య, మంజుల పాల్గొన్నారు.

కోదాడ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు
- ఒకే కుటుంబంలోని ఆరుగురు మృతి

కోదాడ రూరల్, ఏప్రిల్ 25 : కోదాడ పట్టణ శివారు 65వ నంబర్ జాతీయ రహదారి శ్రీరంగాపురం సమీపంలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైవే పై ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబంలోని ఆరుగురు వ్యక్తులు మృతిచెందారు. పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండల పరిధి చిమిర్యాల గ్రామానికి చెందిన జెల్లా శ్రీకాంత్‌కు ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన నల్లమల్ల రామచందర్‌రావు కుమార్తె నాగమణితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమార్తెలు. శ్రీకాంత్ హైదరాబాద్ మణికొండలోని ఫ్రెండ్స్ కాలనీలో కుటుంబంతో నివసిస్తూ కారు డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. మామ రామచందర్‌రావు కూడా అదే కాలనీ వాచ్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబంతో జీవిస్తున్నాడు. కాగా శ్రీకాంత్ తన చిన్న కుమార్తె లావణ్య పుట్టినరోజును పురస్కరించుకుని పుట్టు వెంట్రుకలు తీయించేందుకు ఏపీలోని విజయవాడ దగ్గర గుణదలలో గల మేరీ మాత దేవాలయానికి బుధవారం రాత్రి కారులో బయల్దేరాడు. శ్రీకాంత్, ఆయన భార్య నాగమణి, వారి పెద్ద కుమార్తె లాస్య, చిన్న కుమార్తె లావణ్య, మామ రామచందర్‌రావు, ఆయన భార్య మణిక్యమ్మ, బావమరిది కృష్ణంరాజు (కారు డ్రైవర్), ఆయన భార్య స్వర్ణకుమారి, వారి ఇద్దరు కుమారులు కౌశిక్, కార్తీక్‌లు ఎర్టిగా కారులో హైదరాబాద్ నుంచి బయల్దేరారు. గురువారం తెల్లవారుజామున కోదాడ పట్టణ శివారు శ్రీరంగాపురం సమీపానికి చేరుకోగా జాతీయ రహదారిపై పక్కగా ఆగి ఉన్న లారీని కారు అదుపుతప్పి వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ (32), లాస్య (4), రామచందర్‌రావు (50), మాణిక్యమ్మ (45), కృష్ణంరాజు (26), స్వర్ణకుమారి (23) అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడ్డ నాగమణిని 108 వాహనంలో కోదాడ ఆస్పత్రికి అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీకాంత్ బంధువు నందిగామ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన కారు

నేడు సంతోషిమాత దేవాలయానికి పుష్పగిరి స్వామి రాక

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 25 : జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయానికి శుక్రవారం పుష్పగిరి పీఠాధిపతి, జగద్గురు విద్యాశంకరభారతి మహా స్వామిజీ విచ్చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నూక వెంకటేశంగుప్తా, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్ తెలిపారు. గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన కమిటీ, భక్తుల సమావేశంలో వారు మాట్లాడారు.

కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి

● బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బాలవెంకట్‌రెడ్డి

మేళ్లచెర్వు, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బోగాల బాలవెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, అందజేసి సంక్షేమ పథకాలను గడప గడపకూ ప్రచారం చేయాలన్నారు. అలాగే ఈ 27న మండల కేంద్రంలో నిర్వహించే పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కూన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

గరిడేపల్లి : నల్లగొండ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు మండవ నాగేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో కోరారు. బీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు తగిన న్యాయం జరిగిందని తిరిగి అటువంటి పాలనే కొనసాగాలంటే ఎంపీగా కృష్ణారెడ్డిని గెలిపించాలన్నారు.

'వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి'

క్రీడాకారులకు వాలీబాల్స్ అందిస్తున్న దాతలు

కోదాడ రూరల్, ఏప్రిల్ 25 : వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మై హోం ఎస్టేట్ మేనేజర్ సీహెచ్ అశోక్ అన్నారు. జాతీయ వాలీబాల్ మాజీ క్రీడాకారుడు తమ్మిశెట్టి శ్రీనివాస్‌రావు, గ్రౌండ్ వాకర్ సూర్యనారాయణరాజు వాలీబాల్ క్రీడాకారులకు రూ.3 వేల విలువ గల బాల్స్ అందించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మై హోం ఎస్టేట్ విష్ణువర్ధన్‌రావు, ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ ఖాలీద్‌సాబ్, కౌన్సిలర్ ఖాజాభాయ్, ఎస్‌కే నయీం, అలెక్స్, పి.భాస్కర్, క్రీడాకారులు పాల్గొన్నారు.